క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో జలధి పూజలు



అలంకరణలో గంగమ్మ, వీర దిమ్మమ్మ, భైరవస్వాములు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని నాగులబావివీధిలో శనివారం గంగమ్మతల్లి, వీర దిమ్మమ్మ, శ్రీ భైరవస్వాముల జలధి పూజను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుడికట్టు పూజారులు వీరనాగప్పనాయుడు, పెద్దల ఆధ్వర్యంలో స్వాములను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూల పల్లకీపై ఊరేగించారు. అనంతరం చిన్నూరు రోడ్డులోని వంక వద్ద జలధి పూజ చేశారు. వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వాములకు గ్రామోత్సవం నిర్వహించారు. చిన్నూరు వంక వద్ద అచ్చు, గుండు ఎత్తే పోటీలు ఉత్సాహంగా సాగాయి. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించాలి

ముదిగుబ్బ: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు కూడా కాకనే విద్యుత్ బిల్లులను పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపడం దారుణమన్నారు. కరెంటు బిల్లులను ఇష్టానుసారంగా పెంచితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. సీపీఐ నాయకులు చల్లా శ్రీనివాసులు, రైతు సంఘం మండల అధ్యక్షులు డాబా రామక్రిష్ణ, రాధాకృష్ణ, చెన్నప్ప, సత్యనారాయణ, కంసల రామచంద్ర, తిప్పయ్య, ఆదెప్ప, తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి క్రికెట్ టోర్నీ

ధర్మవరం అర్బన్: ధర్మవరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 6వతేది నుంచి ధర్మవరం చేనేత క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. చేనేత నాయకులు సంధా రాఘవ ఆధ్వర్యంలో నిర్వహించే టోర్నీలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన క్రికెట్ క్రీడాకారులు మాత్రమే అర్హులని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.1 లక్ష, ద్వితీయ బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి కింద రూ.10 వేలు నగదు బహుమతులు అందిస్తామరు. వివరాలకు అన్నం సాయి 9700658525, భరత్ 7337714755, ఫయాజ్ 7780595596 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వక్ఫ్ పరిరక్షణ మహాసభ విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న సయ్యద్ రోషన్ జమీర్

ధర్మవరం అర్బన్: విజయవాడలోని కుమ్మరిపాలెం ఈద్గా మైదానంలో ఆదివారం సాయంత్రం జరిగే వక్ఫ్ పరిరక్షణ మహాసభను విజయవంతం చేద్దామని ఎంఎండీఏ(ముస్లిం మైనార్టీ డెవలప్‌మెంట్ అసోసియేషన్) సత్యసాయి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రోషన్ జమీర్ ముస్లింలను కోరారు. పట్టణంలోని ఎంఎండీఏ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహాసభకు మసీదు మత పెద్దలు, మైనార్టీ నాయకులు, దర్గా, ఖాన్గా పెద్దలు, ఎంఎండీఏ నాయకులు, ముస్లింలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. నాయకులు ఖాదర్‌వలి, ముంతూ, మస్తాన్‌వలి, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక



ప్రవళ్లిక

ముదిగుబ్బ: కొడవండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్. ప్రవళ్లిక రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శంకర్‌రెడ్డి శనివారం తెలిపారు. గత నెల 30న ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్–14 బాలికల ఖోఖో పోటీల్లో ప్రవళ్లిక ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు పీడీ శాంతలింగం, పీఎంసీ చైర్మన్ లింగమయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

సీపీఎం మండల కమిటీ ఎన్నిక

ఎన్పీకుంట: మండల కేంద్రంలో శనివారం సీపీఎం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బడా సుబ్బిరెడ్డి ఆధ్వర్యంలో మండల కమిటీ ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా కే.కే రాజారెడ్డి, జిల్లా మహాసభ ప్రతినిధిగా నాగరాజు, సభ్యులుగా గంగిరెడ్డి, మల్‌రెడ్డి, రమణప్ప, ఖాదర్‌బాషాను ఎన్నుకున్నారు. పార్టీ పురోభివృద్ధితోపాటు ప్రజా సమస్యలపై పోరాడతామని నూతన కమిటీ తెలియజేసింది.

వంటింట్లో ధరల మంట



మార్కెట్‌లో నిత్యావసర వస్తువులు



కూరగాయల దుకాణం

- భారీగా పెరిగిన నిత్యావసర ధరలు
- బెంబేలెత్తిపోతున్న సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు
- ధరలు నియంత్రిస్తామని హామీ ఇచ్చి.. చేతులెత్తేసిన చంద్రబాబు

ముదిగుబ్బ: ఏమి కొనేటట్లు లేదు.. ఏమి తినేటట్లు లేదు.. నాగులో నాగన్న అనే పాటను ఏ సందర్భంలో పాడారో కాని నేడు ఆ పాట వాస్తవ రూపం దాల్చుతోంది. పేద మధ్య తరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారుతోంది. రోజు రోజుకూ నిత్యావసర ధరలు పెరిగిపోతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి పండుగ సందర్భంగా మండుతున్న నిత్యావసర వస్తువుల ధరలను చూసి మధ్య తరగతి, సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత రెండు నెలల నుంచి మార్కెట్‌లో సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పండుగ పూట సరుకులు కొందామని మార్కెట్‌కు వెళ్తే.. ఆకాశాన్నంటుతున్న ధరలతో ప్రజల గుండె దడ పెరుగుతోంది. ఓ వైపు కిరాణ వస్తువులు, మరో వైపు కూరగాయల ధరలు పెరిగిపోతుండటంతో పేద ప్రజలు ఏమి కొనలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా సన్ ఫ్లవర్, పామాయిల్ నూనె ధరలు మండిపోతున్నాయి. అదే విధంగా కొబ్బరి, వెల్లుల్లి, టమాట ధరలు అమాంతం పెరిగిపోయాయి. సన్‌ఫ్లవర్ అయిల్ 15 లీటర్ల డబ్బా రెండు నెలల క్రితం రూ.1,600 ఉండగా.. ప్రస్తుతం రూ.2,000 పైగానే ధర పలుకుతోంది. కొనలేం.. తినలేం అంటూ సామాన్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కిరాణా దుకాణాలు వెలవెల..

పండుగ వేళ సరుకుల కొనుగోళ్లతో కిటకిటలాడాల్సిన కిరాణా దుకాణాలు వెలవెలబోతున్నాయి. హోల్‌సేల్‌తో పాటు రిటైల్ షాపుల నిర్వాహకులు సైతం వ్యాపారాలు లేక సతమతమవుతున్నారు. ఎవరైనా వచ్చినా అరకొర సరుకులు తీసుకెళ్లుతున్నారు. ధరలు విపరీతంగా పెరగడంతో ఉన్నంతలో అరకొర కొనుగోళ్లతో పేద ప్రజలు సర్దుకుంటున్నారు.

బాదుడే బాదుడు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిత్యావసర వస్తువులు పెరిగిపోయాయని ఎన్నికలకు ముందు కూటమి నాయకులు బాదుడే బాదుడు కార్యక్రమంతో ఎన్నో ఆరోపణలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నిత్యావసర సరుకులు తగ్గిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ధరలు తగ్గించకపోగా బాదుడే.. బాదుడంటూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారు.

వస్తువు పేరు	2 నెలల క్రితం ధర	ప్రస్తుత ధర
పామాయిల్ లీటర్	రూ.110	రూ.140
సన్‌ఫ్లవర్ ఆయిల్	రూ.110	రూ.140
గోధుమ పిండి	రూ.40	రూ.45
చింత పండు	రూ.120	రూ.130
తెల్లగడ్డలు	రూ.200	రూ.380
కందిబేడలు	రూ.170	రూ.160
శనగబేడలు	రూ.90	రూ.100
ఎండు కొబ్బరి	రూ.140	రూ.200
పప్పులు	రూ.100	రూ.110
ఉప్మారవ్వ	రూ.40	రూ.45
బెల్లం	రూ.50	రూ.55
చక్కెర	రూ.40	రూ.45
శనగ పిండి	రూ.100	రూ.120
టెంకాయ ఒకటి	రూ.20	రూ.30

ఏమీ కొనలేని పరిస్థితి



నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పెరిగిన ధరలతో మార్కెట్లో ఏమీ కొనలేని పరిస్థితి నెలకొంది. కిరాణా సరుకులు, కూరగాయల ధరలు ఆకాశానంటుతున్నాయి. జేబు నిండా డబ్బులు తీసుకెళ్లితే బ్యాగులో కొన్ని సరుకులను మాత్రమే ఇంటికి తీసుకురావాల్సి వస్తోంది. పండుగ పూట ఏది కొందామన్నా ధరలను చూసి భయం వేస్తోంది. ఇలాగైతే మాలాంటి మధ్య తరగతి, సామాన్య ప్రజలు ఎలా జీవించాలి? – మునిచంద్ర, దొరిగిల్లు

ధరల నియంత్రణకు పోరాటం



నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచేశారు. సామాన్యులు, మధ్య తరగతి ప్రజలపై భారం పడుతోంది. ప్రభుత్వాలు స్పందించి పెరిగిన ధరలను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి. లేని పక్షంలో ప్రజలతో కలిసి పోరాటాలు చేశారు. ప్రభుత్వం ధరలను నియంత్రించాలి. – వెంకటేష్, సీపీఎం నాయకుడు, ముదిగుబ్బ

ధరలు చూస్తే భయమేస్తోంది..



గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యావసర ధరలు పెరిగాయి. ధరలు నియంత్రిస్తామని చెప్పిన చంద్రబాబు ప్రస్తుతం పట్టించుకోవడం లేదు. పామాయిల్ లీటర్ రూ.140, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.140 వరకూ పెంచేశారు. వంట నూనెలు కొనలేకపోతున్నాం. వందల రూపాయలు తీసుకెళ్తే కొద్ది పాటి కూరగాయలు మాత్రమే కొనాల్సి వస్తోంది. – లక్ష్మీదేవి, ముదిగుబ్బ

విజ్ఞాన సదస్సులతో మహిళా జాగృతి



మాట్లాడుతున్న సినియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి

కదిరి టౌన్: మహిళలు మోసపోకుండా జాగృతపరచడానికి న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయలక్ష్మి పేర్కొన్నారు. కదిరి కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఈనెల 16న తలుపుల, 23న కదిరి రూరల్ మండలాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జడ్జి తెలిపారు. గృహహింస, వరకట్న వేధింపులు హత్యలు, లైంగిక వేధింపులు, మహిళల అపహరణ, అక్రమ రవాణా, యాసిడ్ దాడులు, సమాన పనికి సమాన భృతి, మహిళలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న అంశాలపై సదస్సులో చర్చిస్తామన్నారు. మహిళలు చైతన్యవంతులైనప్పుడే కుటుంబం, సమాజం సౌభాగ్యవంతంగా ఉంటుందన్నారు. న్యాయవాదులు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, నరసింహులు, గురులింగస్వామి, రెడ్స్ భానుజా, సీడీపీఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు మండలంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం సుడిగాలి పర్యటన చేశారు. కొత్తదేవరపల్లికి చెందిన పార్టీ నేత కృపానందరెడ్డి తల్లి జయమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేగ్రామంలో ప్రమాదవశాత్తు గాయపడిన సుదర్శన్‌రెడ్డి కుమారుడిని కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కే.లోచర్లలో ఇటీవల మృతి చెందిన ఈశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే ఓదార్చారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆదినారాయణరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. యర్రపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దేరంగుల రాజేంద్ర, హోంగార్డు చెన్నప్ప, చెన్నరాజుపల్లి కేసులప్ప కుటుంబాలను పరామర్శించారు. అనంతరం అదే గ్రామంలో టీడీపీ నేతల చేతిలో దాడులకు గురైన పార్టీ కార్యకర్తలు ఇంద్రశేఖర్‌రెడ్డి, రత్నమ్మ, హేమంత్‌రెడ్డిని కలిసి ధైర్యం చెప్పారు. కొత్తచెరువు నేత వాల్మీకి శంకర్ నాన్న పోతులయ్య పార్టీ ఓటమిని తట్టుకోలేక మృతి చెందడంతో వారిని పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ దాల్ మిల్ సూరి నాన్న వెంకటరాముడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన క్షేమ సమాచారాలను ఆరా తీశారు. మాజీ ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు తొలగించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ధర్మవరం: రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిల్వ ఉంటున్నా పట్టించుకోరా అని సీపీఎం నాయకులు విమర్శించారు. పట్టణంలోని గాంధీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ భాషా, జేవీ రమణ, అయూబ్‌ఖాన్, ఎస్‌ఎఫ్‌ఐ నాగార్జున, హరి, వెంకటస్వామి, లాజర్ మాట్లాడుతూ గాంధీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి దగ్గర నీరు నిల్వ ఉండటంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మురుగునీరు సైతం బ్రిడ్జి కింద చేరడంతో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. అధికారులు స్పందించి వెంటనే రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీటిని తొలగించాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్‌డీఆర్‌ఆర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ జీఎస్ సాగర్, లక్ష్మీరామ్‌నాయక్, సిబ్బంది మల్లికార్జునరెడ్డి, శివారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లన్నీ బాగుచేస్తాం



రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీత

కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గంలో దెబ్బతిన్న గ్రామీణ రోడ్లన్నీ బాగు చేయిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. శనివారం ఆమె తగరకుంట రహదారిలో పండమేరు వంక వద్ద ఉన్న రోడ్డుకు మరమ్మత్తు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాప్తాడు నియోజకవర్గంలో 125 కి.మీ. మేర రోడ్లు దెబ్బతిన్నాయని, వాటి మరమ్మత్తు చేయించేందుకు ప్రభుత్వం ప్రస్తుతానికి రూ.2.5 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. వీటి ద్వారా సకాలంలో రోడ్డు పనులు పూర్తి చేయించాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, మండల స్థాయి అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక మాస పూజలు



పూజలందుకున్న ఓంకారేశ్వరుడు



అలంకరణలో ముష్టూరులోని శివుడు

బత్తలపల్లి: మండలంలోని శివాలయాల్లో శనివారం కార్తీక పూజలను వైభవంగా నిర్వహించుకున్నారు. సంఘమేశ్వరక్షేత్రం, కాటి కోటేశ్వరక్షేత్రంతో పాటు బత్తలపల్లిలోని లలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వర ఆలయం, పోట్లమర్రి, ముష్టూరు శివాలయాలు, డి.చెర్లోపల్లిలోని సిద్దేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, గుమ్మల్లకుంట లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలు శివనామస్మరణలతో మార్మోగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లోని శివున్ని అందంగా ముస్తాబు చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. కాటికోటేశ్వర క్షేత్రంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహంకాళీమాత అమ్మవారికి కుంకుమార్చన చేపట్టారు. సంఘమేశ్వరక్షేత్రంలోని ప్రధాన అర్చకులు ఫణికుమార్, జయకుమార్‌లు స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయ సముదాయంలో పిండి ముగ్గులు వేసి ఆపైన ఉసిరి, నిమ్మపండు తొక్కల్లో నేతిదీపారాధన చేశారు.

లోకోజుపల్లిలో మౌలిక సదుపాయాలు మృగ్యం



లోకోజుపల్లి వద్ద కోతకు గురైన మట్టిరోడ్డు

అమడగూరు: లోకోజుపల్లిలో మౌలిక సదుపాయాలు కొరవడ్డాయి. గ్రామంలో 150 కుటుంబాలు ఉన్నాయి. వ్యవసాయం, పాడి, జీవాల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బస్టాండు ప్రాంతంలో మట్టిరోడ్డు కోతకు గురై గుంతలమయంగా మారింది. దీంతో గ్రామం మీదుగా కర్ణాటకకు వెళ్లే రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక తాగునీటికీ కటకటలాడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్న రెండు మంచినీటి పథకాల బోర్లలో తరచూ ఒకటి మొరాయిస్తోంది. మరొక బోరుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ మూడు వారాల క్రితం కాలిపోయింది. దీన్ని పట్టించుకునేవారు కరువయ్యారు. ఇక వీధిలైట్లు కూడా వెలగడం లేదు. సాయంత్రమైతే చాలు గ్రామమంతా చీకట్లు కమ్ముకుంటున్నాయి. కొండ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో రాత్రిపూట జనం బయటకు రావాలంటే జంకుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని మాజీ సర్పంచ్ మాచుపల్లి శివారెడ్డి, గ్రామస్తులు కోరుతున్నారు.

జాతీయ సీనియర్ హాకీ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు



కోచ్ హుస్సేన్‌తో ధర్మవరం హాకీ క్రీడాకారులు

ధర్మవరం అర్బన్: జాతీయ సీనియర్ హాకీ పోటీల్లో ధర్మవరం క్రీడాకారులు పాల్గొననున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ బంధనాథం సూర్యప్రకాష్ తెలిపారు. క్రీడాకారులను శనివారం ఆయన అభినందించారు. హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి 16 వరకు చెన్నైలో జరగనున్న 14వ పురుషుల జాతీయ సీనియర్ హాకీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ధర్మవరం క్రీడాకారులు హరీష్, వెంకటేష్‌నాయక్, రాజేష్ ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర జట్టుకు కోచ్‌గా సత్యసాయిజిల్లా క్రీడా ప్రాధికార సంస్థ హాకీ కోచ్ హుస్సేన్ వ్యవహరించనున్నారని తెలిపారు. జాతీయస్థాయిలో కూడా ధర్మవరం క్రీడాకారులు రాణించాలని హాకీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హాకీ శ్రీసత్యసాయి జిల్లా గౌరవాధ్యక్షుడు బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఉడుముల రామచంద్ర, గౌరీప్రసాద్, మహమ్మద్ అస్లాం, ట్రెజరర్ అంజన్న, జాయింట్ సెక్రటరి అరవింద్‌గౌడ్, చంద్రశేఖర్, డైరెక్టర్లు మారుతి, ఇర్షాద్, సీనియర్ క్రీడాకారులు ఊకా రాఘవేంద్ర, అమునుద్దిన్, కిరణ్ తదితరులు క్రీడాకారులను అభినందించారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

కదిరి అర్బన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కదిరి నుంచి శైవక్షేత్రాల దర్శనానికి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం మైనోద్దీన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుగ్గ రామలింగేశ్వరస్వామి, యాగంటి, మహానంది, శ్రీశైలం, అరుణాచలం, కోటిలింగాలు, ఈషా ఫౌండేషన్ ప్రదేశాలకు ఈనెల 4, 11, 18 తేదీల్లో బస్సులు బయలుదేరుతాని తెలిపారు. భక్తుల కోరిన ప్రదేశాలకు కూడా ప్రత్యేక సర్వీసులు నడుపుతామని పేర్కొన్నారు. వివరాలకు 9959225892 నంబరులో సంప్రదించాలని సూచించారు.

6 నుంచి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

తలుపుల: మండలంలోని ఓబుళేశ్వరస్వామి కొండపై వెలసిన ఓబుళేశ్వరుడి ఆలయంలో ఈ నెల 6, 7, 8వ తేదీల్లో ఓబుళేశ్వరుడిని విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పూజారి గుజ్జు శ్రీనివాసులు తెలిపారు. 6 వతేదీ ఉదయం అఖండ దీపారాధన, గంగపూజ, గణపతి పూజ, 7వ తేదీ నవగ్రహస్థాపన, నవగ్రహపూజ, కలశ స్థాపన, అంకురార్పణ, తదితర కార్యక్రమాలు, 8వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 9 గంటల్లోపు పీఠపూజ, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఓబుళేశ్వస్వామి కాప్పులు తెలిపారు.

పనులు మొదలయ్యేదెన్నడో..?



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి (ఫైల్)

పుట్టపర్తి: కూటమి సర్కారు కొలువుదీరిన తర్వాత గత నెలలో 'పనుల పండుగ' కార్యక్రమం నిర్వహించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పలు చోట్ల ముఖ్య అతిథిగా హాజరై సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 404 పనులకు రూ.18 కోట్ల నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ అధికారులు ప్రకటించారు. మండలాల వారీగా బుక్కపట్నంలో 64 పనులకు రూ.3 కోట్లు, పుట్టపర్తిలో 79 పనులకు రూ.3.44 కోట్లు, కొత్తచెరువులో 67 పనులకు రూ.3.29 కోట్లు, నల్లమాడలో 78 పనులకు రూ.3.10 కోట్లు, ఓడీచెరువులో 55 పనులకు రూ.3 కోట్లు, అమడగూరులో 62 పనులకు రూ.3 కోట్లు కేటాయించారు. రెండు వారాలు దాటినా ఇప్పటి వరకు ఎక్కడా సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. అధికార తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య పనుల పంపకాలకు సయోధ్య కుదరకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. రాజకీయాలు పక్కన పెట్టి పనులు తొందరగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తపాలా పథకాలపై అవగాహన

బత్తలపల్లి: తపాలా వారోత్సవాల్లో భాగంగా ధర్మవరం మండలం గొట్లూరు గ్రామంలో శనివారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ మాట్లాడుతూ పోస్టాఫీసులో డబ్బు కట్టిన వెంటనే బ్యాలెన్స్ సరిచూసుకోవాలన్నారు. పీఓఎస్‌బీ అకౌంట్‌కు సెల్‌ఫోన్ నంబర్ లింక్ చేయించుకోవాలని సూచించారు. పోస్టల్ స్కీంలు, గ్రామీణ తపాలా జీవిత బీమా గ్రామీణులకు, పీఎల్ఐ ఉద్యోగస్తులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎంఓ బుడ్డన్న, బీపీఎం కొడవండ్లపల్లి హేమ, ఏబీపీఎం నాగభూషణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీ కటాక్ష హోమం



పూజల్లో పాల్గొన్న భక్తులు

తాడిమర్రి: స్థానిక కుండలిని శక్తి పాత్ సిద్ధ మహాయోగి చౌడేశ్వరి, రమ్యాదేవి ఆశ్రమంలో ఆరు రోజులుగా జరుగుతున్న లక్ష్మీ కటాక్ష నిత్య హోమం, యజ్ఞం శనివారం ముగిసింది. కార్యనిర్వాహకుడు గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురుమాత రమ్యాదేవి శివానందస్వామితో కలసి హోమం నిర్వహించారు. తెల్లవారు జామున హోమం, యజ్ఞం ప్రారంభించి, సూర్యోదయ సమయానికి ముగించారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు తరలిచ్చి చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగినికి తీవ్ర గాయాలు

తనకల్లు: మండలంలోని కొక్కంటిక్రాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉద్యోగిని శోభకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు... అన్నమయ్య జిల్లా మేకలచెరువుకు చెందిన శోభ మొలకలచెరువులోని ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తోంది. శనివారం వ్యక్తిగత పనిమీద శోభ తన మూడు చక్రాల వాహనంలో కొక్కంటిక్రాస్‌కు వచ్చింది. తరువాత అదే వాహనంలో స్వగ్రామానికి బయలుదేరింది. అయితే చెక్‌పోస్ట్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న బైక్ వేగంగా వచ్చి ఆమెను ఢీ కొంది. ఈ ప్రమాదంలో గాయపడిన శోభను మొలకలచెరువుకు తీసుకెళ్లారు. అనంతరం అక్కడి వైద్యుల సూచన మేరకు మదనపల్లికి తరలించారు.

వృద్ధుడు అదృశ్యం



కృష్ణారెడ్డి(ఫైల్)

గాండ్లపెంట : మండలంలోని మునగలవాండ్లపల్లికి చెందిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఏఎస్ఐ రంగానాయక్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మునగల కేశవరెడ్డి(77) 15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ప్రయోజనం లేకపోయింది. శనివారం బాధితుడి కుమారుడు రెడ్డిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టినట్లు ఏఎస్ఐ తెలిపారు.